నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 24-4-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 220 పేజీలు:4 వెల: రూ.1/-

రేపు సుప్రీంకోర్టు సీజేఐగా ఎన్వీ రమణ ప్రమాణస్వీకారం

హైదరాబాద్ ఏప్రిల్ 23: భారత సుప్రీంకోర్టు 48వ ప్రధాన న్యాయమూర్తిగా తెలుగు వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణను నియమిస్తూ ఇప్పటికే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సీజేఐగా కొనసాగుతున్న ఎస్ఏ బోబ్డే పదవీ కాలం శుక్రవారంతో ముగుస్తుండంతో ఈరోజే ఆయన పదవీ విరమణ చేయనున్నారు. అనంతరం శనివారం సాయంత్రం జస్టిస్ బోబ్డేకు వీడ్కోలు సమావేశం నిర్వహించి తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కరోనా కారణంగా ఈ సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించనున్నారు. శనివారం నాడు 48వ సీజేఐగా ఎన్వీ రమణ చేత రాష్ట్రపతి కోవింద్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. కోవిడ్ కారణంగా ఈ కార్యక్రమం అతికొద్దిమంది అతిథుల సమక్షంలో జరగనుంది. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, కేబినెట్ సెక్రటేరియట్ అధికారులు, న్యాయ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో పాటు జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులు మాత్రమే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నా శక్తి మేర విధులు నిర్వర్తించాను : జస్టిస్ ఎస్ఏ బోబ్డే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డేకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తదుపరి సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, న్యాయమూర్తులు, అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఏ బోబ్డే మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తిగా తన శక్తి మేర విధులు నిర్వర్తించాననే సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఎన్నో జ్ఞాపకాలు, సంతోషం, సద్భావనతో సుప్రీంకోర్టును విడిచి వెళ్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తిగా చివరి రోజు మిశ్రమ అనుభూతిని మిగిల్చిందన్నారు. న్యాయమూర్తిగా 21 సంవత్సరాలు విధులు నిర్వహించిన తర్వాత తాను పదవి నుంచి వైదొలగుతున్నాని, ఈ కాలం తనకు చాలా జ్ఞాపకాలను మిగిల్చిందని ఉద్వేగానికి లోనయ్యారు. సోదర న్యాయమూర్తులతో కలిసి పని చేయడం అద్భుతంగా ఉందన్నారు. తన స్థానంలో బాధ్యతలు చేపడుతున్న జస్టిస్ ఎన్వీ రమణ తన విధులను సమర్థంగా నిర్వహిస్తారని వ్యాఖ్యానించారు.

కరోనా సమయంలో జస్టిస్ బోబ్డే ప్రారంభించిన వర్చువల్ విచారణతో 50 వేల కేసులు పరిష్కారమైనట్టు అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కొనియాడారు. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. జస్టిస్ బోబ్డే తెలివైన, వివేకవంతమైన న్యాయమూర్తి అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రశంసించారు. జస్టిస్ బోబ్డే అయోధ్య సహా పలు చారిత్రాక కేసుల్లో తీర్పులు వెల్లడించారు. 47వ సీజేఐగా 2019, నవంబర్ నెలలో జస్టిస్ ఎస్ఏ బోబ్డే బాధ్యతలు స్వీకరించారు.

తెలంగాణలో ఒకే రోజులో 2 లక్షలకు పైగా వ్యాక్సినేషన్లు

హైదరాబాద్ ఏప్రిల్ 23: జనవరి 16న కొవిడ్ -19 వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా తెలంగాణలో ఒకే రోజులో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి వ్యాక్సిన్లు ఇవ్వడం రికార్డుగా అధికారులు పేర్కొన్నారు. గురువారం నాడు మొత్తం 2,11,244 మందికి కొవిడ్-19 వ్యాక్సిన్లు ఇవ్వగా అందులో 24,787 మందికి సెకండ్ డోస్ లభించగా, మిగిలిన 1,86,457 మందికి మొదటి డోస్ లభించింది. తెలంగాణలో ఇప్పటివరకు మొత్తం 31,59,780 మందికి కొవిడ్ -19 వ్యాక్సిన్ మొదటి డోస్ లభించగా అందులో 2,38,182 మంది ఆరోగ్య కార్యకర్తలు, 2,21,275 మంది ఫ్రంట్‌లైన్ కార్మికులు, 27,00,323 మంది 45 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు.వ్యాక్సినేషన్ బులెటిన్ ప్రకారం 4,42,954 మంది వ్యక్తులు తమ మొదటి, రెండవ డోస్ వ్యాక్సిన్లను పొందారు. ఈ-విన్ పోర్టల్ ప్రకారం.. ఇప్పటివరకు తెలంగాణ 37,24,350 కొవిడ్ వ్యాక్సిన్ డోస్‌లను పొందింది. 62,970 డోసులు ఆర్మీ సిబ్బందికి, 19,920 డోసులను కొవిడ్ టీకా కేంద్రాలలో(సీవీసీ) అధునాతన షెడ్యూలింగ్ కోసం బఫర్‌గా పొందారు. తెలంగాణలో గురువారం నాటికి మొత్తం 36,41,460 కొవిడ్ వ్యాక్సిన్లను వినియోగించినట్లుగా 1.06 శాతం వ్యర్థం అయినట్లుగా పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ విడుదల చేసిన బులెటిన్ తెలిపింది.

భారత్‌కు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం : ఫ్రెంచ్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 23:: కరోనా రెండో వేవ్‌తో తీవ్ర ఇబ్బంది పడుతున్న భారత్‌కు అన్నివిధాలా సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మక్రాన్ అన్నారు.

"కరోనా కేసులు పెరిగి ఇబ్బంది పడుతున్న భారత ప్రజలకు నేను సంఘీభావ సందేశం పంపాలని అనుకుంటున్నా. ఈ కష్టకాలంలో ఫ్రాన్స్ మీకు తోడుగా ఉంటుంది. ఈ మహమ్మారి ఎవరినీ విడిచిపెట్టదు. మేం అన్నివిధాలా భారత్‌కు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నాం" అని మక్రాన్ పేర్కొన్నారు.

ఫ్రెంచ్ రాయబారి ఇమాన్యుయేల్ లెనైన్ తన అధికార ట్విట్టర్లో దేశాధినేత సందేశాన్ని పోస్టు చేశారు. దేశంలో కరోనా రెండో వేవ్ కారణంగా పాజిటివ్ కేసులు భారీగా పెరుగుతున్నాయి.

పలు రాష్ట్రాల్లోని దవాఖానల్లో రోగులకు చికిత్స కోసం పడకలు, మెడికల్ ఆక్సిజన్ సైతం లభించడం లేదు.

శుక్రవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 3.32 లక్షల కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడి 2263 మంది మరణించారు.

కరోనాని ధైర్యంగా ఎదుర్కొందాం : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ ఏప్రిల్ 23: కరోనాపై ఆందోళన వద్దు. ఆ మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొందామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లోని కరోనా బాధితులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీకు మరీ ఇబ్బందులు అనిపిస్తే నాకు గానీ, నా వద్ద పని చేసే సిబ్బందికి గానీ ఫోన్ చేయాలని సూచించారు. బాధితుల యోగ క్షేమాలు, అందుతున్న వైద్యం, తీసుకుంటున్న జాగ్రత్తలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

వ్యాధి సోకిన వారు ఆందోళన చెందాల్సిన పనిలేదు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే తగ్గిపోతుందని భరోసా కల్పించారు. ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలువాలని మంత్రి సూచించారు.

అధిక భారం ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో కోవిడ్-19 స్థితి పై జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధాన మంత్రి

-మనం ఒకే దేశం గా పనిచేశామంటే, ఎలాంటి వనరుల కొరతా ఉండబోదు: ప్రధాన మంత్రి

-పయాణ సమయాన్ని తగ్గించడం కోసం, ఆక్సీజన్ ట్యాంకర్ ల కోసం రైల్వేస్ ను, వాయు సేన లను రంగం లోకి దింపడం జరుగుతోంది: ప్రధాన మంత్రి

-అత్యవసర మందుల, సూది మందు ల దొంగనిలువల పైన, నల్ల బజారు విక్రయాల పైన కఠినం గా వ్యవహరించవలసిందిగా రాష్ట్రాల ను అభ్యర్థించిన ప్రధాన మంత్రి

-రాష్ట్రాల కు 15 కోట్ల కు పైగా డోసుల ను కేంద్రం ఉచితం గా అందజేసింది: ప్రధాన మంత్రి

-ఆసుపత్రుల భద్రత విషయం లో నిర్లక్ష్యం తగదు: ప్రధాన మంత్రి

-భయాందోళనల కు లోనై కొనుగోళ్లు జరపడాన్ని తగ్గించడం కోసం ప్రజల లో జాగృతి ని పెంపొందించాలి: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:ఇటీవల గరిష్ఠ సంఖ్య లో కేసులు నమోదు అయిన 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య మంత్రుల తో కోవిడ్-19 స్థితి పై జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.

వైరస్ అమాంతం రెండో అంచె నగరాలు, మూడో అంచె నగరాల తో సహా అనేక రాష్ట్రాల పై ప్రభావాన్ని చూపుతోందని గమనించిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ మహమ్మారి తో సామూహిక బలాన్ని ఉపయోగించి కలసికట్టగా పోరాడదామంటూ పిలుపునిచ్చారు. మహమ్మారి ఒకటో దశ లో భారతదేశం సాధించిన సాఫల్యానికి మన ఉమ్మడి ప్రయాస లు, సమష్టి వ్యూహం అతి పెద్ద మూల కారణం అని ఆయన చెప్తూ, ఈ సవాలు ను మనం ఇదే పద్ధతి లో పరిష్కరించాలి అన్నారు.

ఈ పోరాటం లో అన్ని రాష్ట్రాల కు కేంద్ర పూర్తి మద్దతు ను ఇస్తుంది అని ప్రధాన మంత్రి హామీ ని ఇచ్చారు. రాష్ట్రాల తో ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంప్రదింపులు జరుపుతూ, స్థితి ని సన్నిహితంగా పర్యవేక్షిస్తోంది, ఎప్పటికప్పుడు రాష్ట్రాల కు అవసరమైనటువంటి సూచనల ను, సలహాల ను అందిస్తోంది అని కూడా ఆయన అన్నారు.

ఆక్సీజన్ సరఫరా పై, రాష్ట్రాలు ప్రస్తావించిన అంశాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రద్ధ గా ఆలకించారు. ఆక్సీజన్ సరఫరా ను పెంచడం కోసం అదే పని గా కృషి జరుగుతోంది అని ఆయన అన్నారు. ప్రభుత్వం లోని సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంబంధిత విభాగాలు ఒక్కటై పాటుపడుతున్నాయన్నారు. పరిశ్రమల లో ఉపయోగించే ఆక్సీజన్ ను కూడా తక్షణ అవసరాల ను తీర్చడం కోసం మళ్లించడం జరుగుతోందన్నారు.

మందుల కు, ఆక్సీజన్ కు సంబంధించిన అవసరాల ను నెరవేర్చడం కోసం రాష్ట్రాలు అన్నీ కూడా కలసికట్టుగా పనిచేయాలి, ఒక రాష్ట్రం తో మరొక రాష్ట్రం సమన్వయాన్ని నెలకొల్పుకోవాలి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఏ ఆక్సీజన్ ట్యాంకరు - అది ఏ రాష్ట్రానికి ఉద్దేశించింది అయినప్పటికీ- మార్గ మధ్యం లోనే దానిని ఆపివేయడమో, లేదా దారి లో అది చిక్కుకోవడమో జరగకుండా ప్రతి ఒక్క రాష్ట్రం శ్రద్ధ తీసుకోవాలి అని ప్రధాన మంత్రి అన్నారు.

ఆక్సీజన్ ను రాష్ట్రం లోని వివిధ ఆసుపత్రుల కు తీసుకు పోవడం కోసం ఒక ఉన్నత స్థాయి సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేయవలసిందిగా అని రాష్ట్రాల ను ప్రధాన మంత్రి కోరారు. కేంద్రం నుంచి ఆక్సీజన్ కేటాయింపు జరిగిన వెను వెంటనే, ఆ ఆక్సీజన్ ను అవసరం మేరకు రాష్ట్రం లోని వివిధ ఆసుపత్రుల కు బట్వాడా అయ్యే విధంగా ఈ సమన్వయ సంఘం పూచీ పడాలి అన్నారు. ఆక్సీజన్ సరఫరా అంశం పై నిన్నటి రోజు న జరిగిన ఒక సమావేశానికి తాను అధ్యక్షత వహించినట్లు, ఆక్సీజన్ సరఫరా ను పెంచేందుకు గల అన్ని ఐచ్ఛికాలను గురించి చర్చించడం కోసం ఈ రోజు న మరొక సమావేశానికి హాజరు కానున్నట్లు ముఖ్యమంత్రుల కు ప్రధాన మంత్రి తెలియజేశారు.

ఆక్సీజన్ ట్యాంకర్ ల ప్రయాణ సమయాన్ని, వాటి రాకపోకల కు పట్టే కాలాన్ని తగ్గించడం కోసం సాధ్యమైనటువంటి అన్ని రకాల ఐచ్ఛికాల పైన కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. దీనికై, ఆక్సీజన్ ఎక్స్ ప్రెస్ ను రైల్వేస్ ఆరంభించినట్లు ఆయన చెప్పారు. ఖాళీ అయిన ఆక్సీజన్ ట్యాంకర్ లను కూడా- వాటి ఒక వైపు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు- వాయు సేన ద్వారా చేరవేయడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి వివరించారు.

వనరుల ఉన్నతీకరణ కు తోడు గా, పరీక్షలు చేయించడం పైన మనం శ్రద్ధ వహించవలసి ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. పరీక్షల నిర్వహణ ను విస్తృత స్థాయి కి చేర్చాలి, అది జరిగితే, ప్రజలు పరీక్ష సదుపాయాన్ని సులభం గా అందుకోగలుగుతారు అని ఆయన స్పష్టం చేశారు.

టీకాల ను వేయించేందుకు మనం చేపట్టినటువంటి కార్యక్రమం ఈ స్థితి లో నెమ్మదించ కూడదు అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం ప్రపంచం లోనే అతి పెద్ద టీకాకరణ కార్యక్రమాన్ని నడుపుతోంది, మరి ఇంతవరకు 15 కోట్ల కు పైగా టీకా మందు డోసుల ను రాష్ట్రాల కు ఉచితం గా భారత ప్రభుత్వం సమకూర్చింది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కు, ఫ్రంట్ లైన్ వర్కర్ లకు, అలాగే 45 ఏళ్ల వయస్సు పైబడిన పౌరులు అందరికీ ఉచితం గా వ్యాక్సీన్ ను అందజేయడానికి కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టిన కార్యక్రమం కూడా అదే విధం గా కొనసాగుతుంది అని ప్రకటించారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన పౌరులు అందరికీ మే నెల ఒకటో తేదీ నాటి నుంచి టీకా మందు అందుబాటు లోకి వస్తుంది అని కూడా ఆయన తెలిపారు. వీలయినంత ఎక్కువ మంది టీకా మందు ను పొందే లాగా మనం ఉద్యమ తరహా లో శ్రమించవలసిన అవసరం కూడా ఉంది అని ఆయన అన్నారు.

రోగుల చికిత్స కు అన్ని చర్యలను తీసుకోవడం తో పాటు, ఆసుపత్రుల లో సురక్షత కూడా చాలా ముఖ్యం అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆక్సీజన్ లీకేజి తాలూకు ఇటీవలి ఘటన ల పట్ల, ఆసుపత్రుల లో మంటలు రేగడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దు:ఖాన్ని వ్యక్తం చేస్తూ, భద్రత సంబంధి ప్రోటోకాల్స్ విషయం లో ఆసుపత్రి పాలన సిబ్బంది కి మరింత అధిక జాగృతి ని కలిగించవలసిన అవసరం ఎంతయినా ఉందన్నారు.

ప్రజలు గాభరా తో కొనుగోళ్ల కు ఒడిగట్టకుండా పాలన యంత్రాంగం ప్రజల ను ఎల్లప్పటికీ చైతన్యవంతులను చేస్తూ ఉండాలి అని కూడా ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. మనం సమష్టి ప్రయాసల తో మహమ్మారి రెండో వేవ్ దేశం అంతటా విస్తరించకుండా అడ్డుకోగలుగుతాం అని ఆయన అన్నారు.

అంతక్రితం, సంక్రమణ ల కొత్త ఉధృతి ని నిలువరించడం కోసం చేపడుతున్న సన్నాహక చర్యల ను వివరించే ఒక నివేదిక ను డాక్టర్ వి.కె. పాల్ సమావేశానికి సమర్పించారు. వైద్య సదుపాయాల ను పెంచడానికి, అలాగే రోగుల కు లక్షిత చికిత్స ను అందించడానికి సంబంధించిన ఒక మార్గ సూచీ ని కూడా డాక్టర్ పాల్ సమావేశానికి నివేదించారు. వైద్య పరమైనటువంటి మౌలిక సదుపాయాల ను, వైద్య బృందాల ను, సరఫరా లను పెంపొందించడం, రోగ చికిత్స సంబంధి నిర్వహణ, కట్టడి, టీకా మందు ను ఇప్పించడం, సముదాయాల ను భాగస్వాముల ను చేయడం వంటి అంశాలను గురించిన వివరాల ను ఆయన ప్రతి ఒక్కరికి తెలియజేశారు.సంభాషణ సాగిన క్రమం లో, ప్రస్తుత వేవ్ లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొంటున్న చర్యల ను గురించి ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు వచ్చారు. ప్రధాన మంత్రి ఇచ్చిన ఆదేశాలు, 'నీతి' అందజేసిన మార్గ సూచీ తాము తమ ప్రతిస్పందనలను ఒక మెరుగైన పద్ధతి లో అమలుపరచడం లో తోడ్పా?టు ను అందించ గలుగుతాయన్న అభిప్రాయాన్ని కూడా వారు వ్యక్తం చేశారు.

ఇదొక వింత రోగం.. నిర్లక్ష్యం వద్దు : మంత్రి ఈటల

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి): కరోనా వైరస్ అనేది ఓ వింత రోగం అని.. దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.

గాలిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఇదొక వింత రోగం. ఏం లక్షణాలున్నా వైద్యులని కలవాలి. ర్యాపిడ్ టెస్టులు, ఆర్టీపీసీఆర్ టెస్టుల ఫలితం వచ్చే వరకు ఆలస్యమైతే.. లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి తక్షణమే ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. నిర్లక్ష్యం కారణంగానే ప్రాణాలు పోతున్నాయి. వైరస్ సోకిన కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించడం లేదు. అయినప్పటికీ ఆ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపి, క్షణాల్లో ప్రాణాలను తీస్తుందన్నారు. పాజిటివ్ అని తెలిస్తే.. నిర్లక్ష్యం చేస్తున్నవారే మరణిస్తున్నారు అని ఈటల పేర్కొన్నారు.కరీంనగర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ట్యాంకు సామర్థ్యం 20 కేఎల్ అని తెలిపారు. ఈ ఆక్సిజన్ ఏడు రోజుల వరకు వస్తుందన్నారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పెంచాలనే ఉద్దేశంతో.. ఇక్కడ ఆ మిషన్‌ను ఏర్పాటు చేశాం. దాంట్లో 400 టెస్టులు చేసే ఆస్కారం ఉంటుంది. ఆటోమేటిక్ మిషన్ అందుబాటులోకి వస్తే రోజుకు 1000 టెస్టులు చేసుకోవచ్చు. ప్రయివేటు ల్యాబ్‌ల మీద ఆధారపడకుండా ఈ సౌకర్యం కల్పించామన్నారు.

ఆక్సిజన్ కొరత లేదు..

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత లేదు అని మంత్రి ఈటల స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఆక్సిజన్ కొరత తీరుతుందన్నారు. మనకు ఆక్సిజన్‌ను విశాఖ నుంచి కేటాయించలేదు. 1300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా నుంచి యుద్ధ విమానాల్లో ఆక్సిజన్‌ను తెప్పిస్తున్నామని తెలిపారు. టెస్టు కిట్ల కొరత కూడా రాష్ట్రంలో లేదన్నారు. జగిత్యాల, మహారాష్ట్రకు రాకపోకల వల్లే అక్కడ ఎక్కువ కేసులు నవోదు అవుతున్నాయని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

ఏపీలో రేపట్నుంచి నైట్ కర్ఫ్యూ.. వ్యాక్సిన్ ఫ్రీ

అమరావతి, ఏప్రిల్ 23: కరోనా మహమ్మారి విజృంభణ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ వ్యాప్తంగా ఈ నెల 24 నుంచి రాత్రి కర్ఫ్యూ అమలు చేయాలని నిర్ణయించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని ప్రకటించారు. కర్ఫ్యూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అందరికీ వ్యాక్సిన్ ఫ్రీ

మే 1వ తేదీ నుంచి 18 ఏండ్ల నుంచి 45 ఏండ్ల వయసున్న వారందరికీ కొవిడ్ టీకాను ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. అయితే 18 నుంచి 45 ఏండ్ల వయసున్న వారు 2,04,70,364 మంది ఉన్నట్లు గుర్తించారు. ఉచిత వ్యాక్సిన్ కోసం రూ. 1600 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కట్టండి

లండన్, ఏప్రిల్ 23:: రాష్ట్రంలో ఏప్రిల్ 30న గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్స్ తో పాటు సిద్దిపేట, అచ్చంపేట, నకిరేకల్, జడ్చెర్ల, కొత్తూరు మున్సిపాలిటీలకు జరగబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్నారై టీఆర్ఎస్ యూకే ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఏడేండ్లుగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇదిలాగే కొనసాగాలంటే ప్రజలంతా సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు.కరోనా సమయంలో, వరదలు సంభవించినప్పుడు తెలంగాణ ప్రభుత్వం వరంగల్ ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుందని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం వరంగల్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సోషల్ మీడియా ద్వారా బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తుందని మండపడ్డారు.తెలంగాణ రాష్ట్రం మీద కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని ఆరోపించారు. ఈ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాటలు విని మోసపోవద్దు అని సూచించారు.సీఎం కేసీఆర్ సహా వారి కుటుంబ సభ్యులు కేటీఆర్, సంతోష్ కరోనా బారిన పడడం మమ్మల్ని బాధించిందన్నారు. వారంతా త్వరగా కోలుకొని ప్రజల ముందుకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని నవీన్ రెడ్డి తెలిపారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్న ఎన్నారై టీఆర్ఎస్ నాయకులు అనిల్ కూర్మాచలం, అశోక్ గౌడ్ దూసరి, సిక్కా చంద్రశేఖర్ గౌడ్, సతీష్ రెడ్డి, చిలుముల సత్యమూర్తి, పృథ్వీ రావుల స్థానిక కరోనా పరిస్థితులని బట్టి క్షేత్రస్థాయి ప్రచారంలో పాల్గొంటారని నవీన్ రెడ్డి తెలిపారు.దేశం లో కరోనా ఉధృతి ఎక్కువ ఉన్నందున ప్రజలంతా తప్పకుండా మాస్క్ ధరించి, భౌతిక దూరాన్ని పాటించాలని, ప్రభుత్వానికి సహకరించి మిమ్మల్ని మీరు కాపాడుకొని ఇతరులకు కరోనా సోకకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

చరిత్రలో నేటినిజం



కొవిడ్ రోగుల మానసిక ఆరోగ్యం పునరుద్ధరణ కోసం యోగా, ప్రకృతి వైద్యం

హైదరాబాద్ ఏప్రిల్ 22: కొవిడ్ తీసుకొచ్చిన సంక్షోభం భారీగా ఉండగా, రెండో దశలో ఉప్పెనలా విరుచుకుపడుతున్న వైరస్ ప్రజల్లో ఒత్తిడి, ఆందోళనను పెంచుతోంది. ఈ మహమ్మారి శారీరకంగానేగాక, మానసికంగా కూడా రోగులను ఇబ్బంది పెడుతోంది. వారి కుటుంబ సభ్యుల్లోనూ ఆందోళన పెంచుతోంది.

కొవిడ్ రోగులకు శారీరక వైద్యంతోపాటు మానసిక వైద్య అవసరాన్ని గుర్తించిన మూడు ప్రముఖ సంస్థలు, వారి మానసిక ఆరోగ్య పునరుద్ధరణకు ప్రామాణిక పద్ధతి (ప్రోటోకాల్)ని రూపొందించేందుకు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఆ సంస్థలు, 'సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా డ నాచురోపతి' (సీసీఆర్‌వైఎన్); ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన స్వతంత్ర సంస్థ అయిన, బెంగళూరులోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్' (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్); బెంగళూరులోని 'స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన' (ఎస్-వ్యాస). ఈ నెల 23వ తేదీన ఉదయం 9.30-11.30 గం. మధ్య వర్చువల్ కార్యక్రమం ద్వారా, 'కొవిడ్ రోగుల మానసిక ఆరోగ్య పునరుద్ధరణకు ప్రామాణిక పద్ధతి'ని ప్రకటిస్తారు. ఎస్-వ్యాస కులపతి డా.హెచ్.ఆర్.నాగేంద్ర ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. దీని తర్వాత, బీఎన్‌వైఎస్ సాధకులకు ఆన్‌లైన్ కార్యశాల నిర్వహించి, 'ప్రామాణిక పద్ధతి' సాధనపై శిక్షణనిస్తారు.

ప్రకృతి వైద్య రంగం ఉద్దేశం ప్రకారం, దేశంలో ఆరోగ్య సంరక్షణ సిబ్బందిపై పెరిగిన ఒత్తిడిని కూడా ఈ కార్యశాల వెల్లడిస్తుంది. కొవిడ్ కేసుల పెరుగుదలతో మన దేశంలోని ఆరోగ్య సంరక్షణ సంస్థలపై భారం పెరిగి, అవి తీరిక లేకుండా పని చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్క రోగి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం సవాలుగా మారింది.

నివేదికల ప్రకారం, కరోనా రోగుల్లో తలెత్తుతున్న మానసిక అనారోగ్యాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆందోళన, ఒత్తిడి పెరిగి కొవిడ్ కేర్ ఆసుపత్రుల్లో ఆత్మహత్యలకు కూడా పరిస్థితులు దారి తీస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. చాలా దేశాల నుంచి అందుతున్న సమాచారాల ప్రకారం, ఐసోలేషన్‌లోని ఒంటరితనపు ఒత్తిడి, ఆరోగ్యం మరింత దిగజారిపోతుందేమోనన్న భయంతో రోగులు పోరాడుతున్నారు. శ్వాసకోశ ఇబ్బందులు, హైపోక్సియా, అలసట, నిద్ర లేమి వంటి సమస్యలు కూడా రోగుల్లో కనిపిస్తున్నాయి. కొవిడ్ రోగులు కోలుకోవడంలో యోగా, ప్రకృతి వైద్యం పద్ధతులు సమర్థవంతమైన ప్రభావాన్ని చూపాయి. రోగుల్లో ఎస్పీఓటూ స్థాయిలు పెరగడానికి, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు తగ్గిపోవడానికి చిన్నపాటి శ్వాస సంబంధ వ్యాయామాలు, ప్రాణాయామం ప్రభావాన్ని చూపినట్లు కనుగొన్నారు. సీసీఆర్‌వైఎన్ నిర్వహించిన అధ్యయనాల్లోనూ ఇవే విషయాలు నిరూపితమయ్యాయి.

కొవిడ్ రోగుల్లో మానసిక అనారోగ్య లక్షణాలను తగ్గించడానికి ఈ 'ప్రామాణిక పద్ధతి' ఒక సహకార ప్రయత్నం వంటిది. కొవిడ్ అధ్యయనం; వ్యాధి వ్యాప్తి; ఒత్తిడి, మానసిక అనారోగ్య పరీక్షలు; యోగా, ప్రకృతి వైద్య పద్ధతులతో ఒత్తిడి, మానసిక అనారోగ్య నిర్వహణపై అవగాహన పెంచడానికి ఆన్‌లైన్ కార్యశాల సాయపడుతుంది.

సీరమ్ ఇన్ స్టిట్యూట్ టీకామందు కేంద్రానికే ఇచ్చేలా ఒప్పందం నిజం కాదు

హైదరాబాద్ ఏప్రిల్ 22: సీరమ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ ఐ ఐ) లో తయారైన టీకామందు మొత్తాన్ని 2021 మే 25 వరకు కేంద్రప్రభుత్వానికి మాత్రమే ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు, అప్పటిదాకా రాష్ట్రాలు అక్కడినుమ్చి కొనుగోలు చేయటానికి వీల్లేదని మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

అయితే ఈ వార్తలు పూర్తిగా అబద్ధం, నిరాధారమైనవి.

దేశవ్యాప్త టీకాల కార్యక్రమాన్ని విస్తరించటానికి, సరళీకృతం చేయటానికి కేంద్ర ప్రభుత్వం 2021 ఏప్రిల్ 19న ఉదార ధర విధానం, వేగవంతమైన కోవిడ్-19 టీకాల కార్యక్రమ వ్యూహం ప్రకటించింది. అది మే 1వ తేదీ నుమ్చి అమలులోకి వస్తోంది.

ఈ సరళీకృత ధర, వేగవంతమైన జాతీయ కోవిడ్-19 టీకా వ్యూహంలో కీలకమైన అంశాం ఏంటంటే, టీకామందు తయారీదారులు తాము ఉత్పత్తి చేసిన మందులో 50% మేరకు భారత ప్రభుత్వానికి ఇచ్చి మిగతా 50% డోసులను స్వేచ్ఛగా రాష్ట్ర ప్రభుత్వాలకు సరఫరా చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు స్వేచ్ఛగా టీకామందు సరఫరాదారులనుంచి టీకా డోసులు కొనుగోలు చేసుకోవచ్చు.

అందువలన ప్రతి నెలా ఉత్పత్తిలో 50% డోసులు కేంద్రానికి ఇచ్చినా, మిగిలిన 50% డోసులు రాష్ట్రాలు కొనుగోలు చేసుకునే వెసులుబాటు కొనసాగుతుంది.

మే 1నుంచి తెలంగాణలో అందరికీ ఉచిత టీకా?

హైదరాబాద్ ఏప్రిల్ 23: హైదరాబాద్, : కరోనా వ్యాక్సిన్‌ను ఫ్రీగా అందించేందుకు పలు రాష్ట్రాలు ముందుకు వచ్చిన నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కూడా ఉచితంగా అందించే అంశాన్ని పరిశీలిస్తోంది. మే 1 నుంచి వ్యాక్సినేషన్ కార్యక్రమం మరింత వేగవంతం కానుండగా, ఇప్పటివరకు తెలంగాణకు పంపిన వ్యాక్సిన్ డోసులపై అసంతృప్తితో ఉంది. వివిధ రాష్ట్రాలు ఇప్పటికే వ్యాక్సిన్ తయారీ సంస్థల నుంచి పెద్దఎత్తున వ్యాక్సిన్ కొనుగోలు చేస్తున్నాయి. వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్‌కు పేరుండగా, పంపిణీని ఇంతకాలం కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇపుడు ఎవరైనా నేరుగా వ్యాక్సిన్ కొనుగోలు చేయవచ్చని చెప్పడంతో.. అందుకు తగ్గట్లుగా తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఫ్రీ వ్యాక్సిన్ అందించే విషయంపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, 45 ఏళ్లు దాటిన వారికి ఫ్రీ వ్యాక్సిన్ అందిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఫ్రీ వ్యాక్సిన్ అందిస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. మే 1 నుంచి 18 ఏళ్లు నిండిన వారికి వ్యాక్సిన్ అందించేందుకు అనుమతులు మంజూరు కావడంతో దీనిపై ప్రభుత్వం చర్చిస్తోంది. కేంద్రానికి 150రూపాయలు, రాష్ట్రాలకు 400రూ.లుగా వ్యాక్సిన్ ధర నిర్ణయించడంపై మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకే దేశం రెండు ధరలు అంటూ.. భగభగలాడారు. కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ప్రజలందరికీ ఉచిత వ్యాక్సినేషన్ చేస్తే.. ఎంత బడ్జెట్ అవుతుందన్న అంశంపై కసరత్తులు చేస్తోంది. ప్రభుత్వంలో ఫ్రీ, ప్రైవేట్‌లో ప్రజల ఇష్టానికి వదిలేసే విధంగా ప్రతిపాదనలు అందగా, దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. హైదరాబాద్‌లో ఉన్న ఉత్పత్తి కంపెనీలతో మంత్రి కేటీఆర్ మాట్లాడి.. దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కరోనా పట్ల అజాగ్రత్తే 'అంత'సంకేతం సుమా...!

కరోనా రెండవ అల ఉప్పెనలా అతి వేగంగా వ్యాప్తిస్తూ దేశవ్యాప్తంగా రోజుకు దాదాపు 3 లక్షలకు కేసులు నమోదు కావడంతో పాటు రెండు వేల లోపు మరణాలు కూడా జరగడం అత్యంత విచారకరం. మూడుసార్లు ఉత్పరివర్తనం (ట్రిపుల్ మ్యుటెంట్ స్ట్రెయిన్) చెందిన వైరస్‌ను మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో గుర్తించడం మరింత ఆందోళనకు కారణం అవుతున్నది. 21 ఏప్రిల్ రోజున దేశంలో 2,95,041 కరోనా పాజిటివ్ కేసులు మరియు 2,023 మరణాలు (మరణాల శాతం 1.18) జరిగాయి. గంటకు 10,000 కేసులు, 60 మరణాలు మరియు గత 11 రోజుల్లో రెట్టింపు పాజిటివ్ కేసులు నమోదై ప్రమాదకర స్థాయికి రావడంతో అందరూ చిగురుటాకులా వణికి పోతున్నారు. తొలి దశ కుదుపును తట్టుకొని బయట పడిన ప్రజానీకానికి రెండో వేవ్ సునామిలా విరుచుకు పడి పెను సవాళ్ళను విసురుతోంది. వ్యాక్సినేషన్ ప్రక్రియ ఒక వైపు, కరోనా పరీక్షల కోసం క్యూలు మరో వైపు వెలుస్తున్నాయి. కరోనా పరీక్షలు చేయించుకున్న జనంలో 15.99 శాతం పాజిటివ్ అని నిర్ధారించబడుతున్నది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 130 మిలియన్ల టీకాలు ఇవ్వగా, గత 24 గంటల్లో 2.9 మిలియన్ డోసులు వేయడం జరిగింది. మహారాష్ట్ర, యూపి, ఢిల్లీ, కేరళ, గుజరాత్, కర్ణాటక, యంపి, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మాత్రమే 77.67 శాతం కేసులు నమోదు అవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 23.15 లక్షల డోసులను 1,196 వ్యాక్సినేషన్ సెంటర్ల ద్వారా వేయడం జరుగగా, రోజుకు 1.15 లక్షల డోసులు వేస్తున్నారు. తెలంగాణలో గత 24 గంటల్లో 6,542 కేసులు మరియు 20 మరణాలు ప్రభుత్వ వివరాలు తెలుపుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో గత 24 గంటల్లో 8,987 కరోనా కేసులు మరియు 35 మరణాలు గుర్తించబడినవి. తెలంగాణలో గత 24 గంటల్లో 5,926 కేసులు మరియు 18 మరణాలు నమోదైనాయి. మరో సారి ప్రయాణాలు ఆగిపోవడం, జీవనాధారాలు తెగిపోవడం, వ్యాపారాలు కుంటుపడడం, జనజీవన స్థంభించడం సర్వసాధారణ అయ్యే దుస్థితి వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని కష్టజీవులు, చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, పండ్ల దుకాణదారులు, వీధి దుకాణాదారుల బతుకు బజారున పడే ప్రమాదకర దుస్థితి వచ్చింది. పలు రాష్ట్రాలు లాక్‌డౌన్లు, నైట్ కర్ఫ్యూలు విధించాల్సిన అగత్యం ఏర్పడింది. పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఒకవైపు బడుగుల బతుకుదెరువు మరోవైపున ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంలా సంకట స్థితి ఏర్పడింది. రెండు ముద్దలు తింటేనే ప్రాణం నిలుస్తుంది. వీధిలోకి వెళితే కరోనా సోకుతుందనే అనుమానంతో పాటు ఒంటరిగా ఉండడం ఆదాయాన్ని మింగే దుస్థితి ఏర్పడింది. లాక్‌డౌన్ విధించడం ఎన్నటికీ పరిష్కారం కాదని, దేశ ఆర్థిక వ్యవస్థ చితికి పోకుండా ప్రగతి రథ చక్రాలు కరోనా నిబంధనలు పాటిస్తూ కదలాల్సిందే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కరోనా కేసులు ఫుల్, ఆసుపత్రుల్లోఖాళీ బెడ్లు నిల్ అయ్యాయి. మందుల కొరత కలవర పెడుతోంది. ఆక్సీజన్ అందడం లేదు, వెంటిలేటర్ సేవలు దొరకడం లేదు. కరోనా ఎవరిని వదలడం లేదు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ వరకు మరియు కుబేరుల నుంచి కటిక పేద వరకు కరోనాకు అందరూ సమానమే అని రెచ్చిపోతోంది. అనేక మంది రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, వివిధ రంగాల ప్రముఖుల్ని కూడా కరోనా వదల లేదు. ఇంత తీవ్రంగా కరోనా వ్యాపిస్తునప్పటికీ సామాన్య జనానికి నెత్తిన పేను పారడం లేదు. మానసిక అలక్ష్యం రాజ్యమేలుతోంది. అతి విశ్వాసం ప్రాణాంతకంగా మారుతుంది. మాస్కుల ధారణలు భారంగా తోస్తున్నాయి. సినిమా హాల్‌కు క్యూలు కడుతున్నారు. దేవాలయాలు, తీర్థ స్థలాలు కిక్కిరిసి పోతున్నాయి. సామాజిక దూరాలు చెవికెక్కడం లేదు. కరోనా క్రమశిక్షణల పట్ల పట్టింపులు లేవు. అనారోగ్య లక్షణాలు కనిపించినా పరీక్షలకు వెళ్లడం లేదు. పాజిటివ్‌లు గృహ నిర్బంధంతో వైద్యం తీసుకోవడం కోసం ఆసక్తి చూపడం లేదు. అజాగ్రత్తతో కరోనా వైరస్‌ను ఆహ్వానిస్తున్నారు. ఒకరి నుంచి కుటుంబ సభ్యులందరికీ సోకుతోంది. మరణాలు పెరిగినా మనోచైతన్యం కనిపించడం లేదు. ఎవరి గొయ్యి వారే తవ్వుకుంటున్నారు. తెలిసి కూడా కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నారు. కరోనా రెండో అల విష కోరల్లో పడడానికి అవకాశం ఇచ్చేస్తున్నారు. కరోనా కట్టడికి మరియు చైన్ తుంచడానికి ఏకైక మార్గం స్వీయ నియంత్రణ అని నమ్మి, మాస్కులే నివారణోపాయాలని మరిచి పోతున్నారు.

స్వీయ నియంత్రణతోనే ప్రాణ పరిరక్షణ అని నమ్మాల్సిందే. చేతులు కాలాక ఆకుల కోసం పరుగెత్తవద్దు. ఆసుపత్రుల సమీపానికి అనవసరంగా వెళ్ళవద్దని గుర్తుంచుకుందాం. కరోనా సోకకుండా భయంతో కూడిన జాగ్రత్తలు తీసుకుందాం. కరోనా సోకితే ధైర్యంగా ఉంటూ, వైద్య సూచనలు పాటిస్తూ స్వీయ నిర్బంధంలో ఉందాం. తీవ్ర అనారోగ్యం అయితేనే వైద్యుని సూచనలతో ఆసుపత్రిలో చేరుదాం. అతి విశ్వాసం, నిర్లక్ష్యం ప్రాణాంతకం అని మరువరాదు. ముక్కు నోరు కప్పేకునేలా నాణ్యమైన (సర్జికల్/ఔ95) మాస్కులను ధరిద్దాం. కనీసం 3 - 4 మీటర్ల సామాజిక దూరాలను పాటిద్దాం.

చేతుల్ని తరుచుగా సబ్బుతో కడుక్కుందాం. సానిటైజర్‌తో చేతులు శుభ్ర పరుచుకుందాం. కళ్ళద్దాలు, ఫేస్ స్క్రీన్లు వాడడం ఉత్తమం. ఇంటిలోకి ఇతరులు వచ్చినపుడు మాస్కులు వాడుదాం. జ్వరం, దగ్గు/జలుబు, రుచి/వాసన కోల్పోవడం లాంటి అనారోగ్య లక్షణాలు కనిపించగానే కరోనా ఖీ-ఖఅఖీ పరీక్ష చేయించుకుందాం. ర్యాపిడ్ ఆంటిజెన్ టెస్టు(ఖీయ)తో మాత్రమే సంతృప్తి పడవద్దు. వైద్యులన సూచిస్తే తప్ప ఆ స్క్యాన్ జోలికి పోవద్దు. అత్యవసరం అయినపుడే బయటకు వెళదాం. నిత్యం ఇంట్లో యోగా, ప్రాణాయామం చేసుకుందాం. సమూహాలుగా గుమిగూడవద్దు, కరోనాకు అవకాశం ఇవ్వవద్దు. ఇంటిలో వెంటిలేషన్ ఉండేలా చూసుకుందాం. మూసి ఉన్న లేదా ఏసి గదుల్లో ఇతరులతో ఎక్కువ సమయం గడపరాదు. కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, ప్రాణ స్నేహితులు ఎవరైనా కరోనా బాధితులు కావచ్చు. ఎవరిని నమ్మి దగ్గరకు వెళ్ళవద్దు. సినిమా హాళ్లు, పబ్బులు, రాజకీయ సమావేశాలు, తీర్థయాత్రలు, దేవాలయాల సందర్శనలు, కాలక్షేపం కోసం రోడ్ల వెంట తిరగడాలు ప్రాణాపాయమని మరువరాదు. మనలోని స్వీయనిగ్రహాన్ని జాగృతం చేద్దాం. మన ప్రాణం మన చేతిలోనే ఉన్నది, అలక్ష్యంతో కరోనా విష చేతుల్లో మన ప్రాణాలను పెట్టరాదు. కరోనా సోకకుండా నియమనిబంధనలు పాటిస్తూ, వైరస్ విషకోరలకు కీలెరిగి వాత పెడదాం. కరోనాను ఏకాకిని చేస్తూ ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రెమిడిసివర్ ఇంజక్షన్లను అధికధరకు విక్రయిస్తున్న

నలుగురు సభ్యుల మూఠా అరెస్ట్

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి): కరోనా వైరస్ వ్యాప్తి ఉధృతి నేపథ్యంలో వైరస్ బారినపడి చికిత్సపొందుతున్న వారికి ఎక్కువగా అవసరమయ్యే రెమిడిసివర్ ఇంజక్షన్లను అధికధరలకు విక్రయిస్తూ రోగుల అవసరాన్ని ఆసరా చేసుకుని ధనార్జనేధేయంగా ఈ అక్రమ దందాకొనసాగిస్తున్న 04సభ్యులుగల మూఠాను శుక్రవారంనాడు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

కరీంనగర్‌లోని కిసాన్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్న దాసరి సురేష్, ముకరంపురా ప్రాంతానికి చెందిన బాలగోని సత్యనారాయణ, కట్టరాంపూర్ ప్రాంతానికి చెందిన కొత్తకొండ వెంకటసాయిలు వరంగల్‌లోని ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్న బొమ్మకంటి నరేష్‌తో సంబంధాలను ఏర్పరచుకుని కరోనా వైరస్ సోకిన వారి చికిత్సకు అవసరమైన రెమిడిసివర్ ఇంజక్షన్లను అధికధరలకు 05వేల రూపాయల విలువగల ఒక్కోఇంజక్షన్‌ను 20నుండి 25వేల రూపాయలవరకు విక్రయిస్తున్నారు.

పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఈ మూఠా కొనసాగిస్తున్న అక్రమదందా సమాచారంపై వలపన్ని కిసాన్‌నగర్ ప్రాంతంలో ఆ 04గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుండి 18 రెమిడిసివర్ ఇంజక్షన్లు, 40వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదైంది.

ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్లు బి మల్లయ్య, కె సృజన్‌రెడ్డి, కరీంనగర్ త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విజ్ఞాన్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పి కరుణాకర్, ఏఎస్ఐ నర్సయ్యలతోపాటు వివిధ స్థాయిలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు. పై అధికారులను పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.

రెమెడిసివర్ ఇంజక్షన్ల కృత్తిమకొరత సృష్టించేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవు -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరోనా వైరస్ బారినపడిన బాధితుల అవసరాలను ఆసరాచేసుకుని అవసరమైన రెమిడిసివర్ ఇంజక్షన్లు, ఇతర రకాల మందులను ధనార్జనే ధ్యేయంగా అధికధరలకు విక్రయిస్తున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు.

ఈ రకమైన దందాలు కొనసాగిస్తున్న వారి సమాచారాన్ని సేకరిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కొన్ని ఆసుపత్రులకు చెందినవారు కూడా ఈ మూఠాసభ్యులతో జతకట్టి చికిత్సకు అవసరంలేకపోయినా నదరు మందులను రాయడంతోపాటు వైరస్ బారిన పడిన బాధితుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందంటూ భయపెడుతూ వివిధ రకాల టెస్ట్‌లు, మందులు అవసరం ఉన్నాయని చెబుతూ భయాదోళనకు గురిచేస్తుండటంతోపాటు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా ఎక్కువమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే విషయం కూడా వెలుగులోకి వచ్చిందని, అలాంటి దందాలకు పాల్పడే ఆసుపత్రులపై కూడా సంబంధిత అధికారుల సహకారంతో దాడులు చేసి చట్టపరమైన తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కృత్తిమకొరత సృష్టిస్తూ, అక్రమదందాలను కొనసాగిస్తున్నవారు వెంటనే వారి అక్రమాలకు స్వస్తిచెప్పకపోయినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రోన్ల ద్వారా కరోనా టీకా డెలివరీ చేసే సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం ఐసీఎంఆర్‌కు అనుమతి

హైదరాబాద్ ఏప్రిల్ 22: డ్రోన్లను ఉపయోగించి కరోనా టీకాలను డెలివరీ చేసే అంశంలో సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం, 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్)కు 'పౌర విమానయాన మంత్రిత్వ శాఖ', 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) షరతులతో కూడిన అనుమతినిచ్చాయి. కాన్పూర్ ఐఐటీతో కలిసి ఐసీఎంఆర్ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లేదా ఒక సంవత్సరం వరకు ఈ అనుమతి చెల్లుబాటు అవుతుంది.

డ్రోన్ల వినియోగం కోసం ఈ క్రింది సంస్థలకు కూడా షరతులతో కూడిన అనుమతులు లభించాయి. ఒక ఏడాదిపాటు లేదా తదుపరి ఆదేశాలు వచ్చేవరకు అనుమతి చెల్లుబాటు అవుతుంది.

-జీఐఎస్ ఆధారిత ఆస్తుల సమాచారం డఎలక్ట్రానిక్ టాక్స్ రిజిస్టర్ తయారు చేయడానికి - డెహ్రాడూన్, హాల్‌ద్వానీ, హరిద్వార్, రుద్రపూర్‌లో ఉన్న నగర్ నిగమ్ సంస్థకు

-రైలు ప్రమాద స్థలాల పరిశీలన, రైల్వే ఆస్తుల రక్షణ కోసం - పశ్చిమ మధ్య రైల్వే, 'కోటా'కు ఏడాది పాటు అనుమతి

-రైలు ప్రమాద స్థలాల పరిశీలన, రైల్వే ఆస్తుల రక్షణ కోసం - పశ్చిమ మధ్య రైల్వే, 'కట్నీ'కు ఏడాది పాటు అనుమతి

వీటితో పాటు, ఆస్తుల తనిఖీ, నమోదు కోసం వేదాంత లిమిటెడ్ (కెయిర్న్ ఆయిల్ ఎగ్యాస్) సంస్థకు 08/04/2022 వరకు డ్రోన్ వినియోగానికి షరతులతో కూడిన అనుమతి దక్కింది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విధించిన షరతులను కచ్చితంగా పాటిస్తేనే ఆయా సంస్థలకు అనుమతి చెల్లుబాటు అవుతుంది. ఏ షరతును ఉల్లంఘించినా అనుమతి రద్దుతోపాటు, ఆ సంస్థపై చర్యలు తీసుకుంటారు. పైన పేర్కొన్న సంస్థలు డ్రోన్లను ఉపయోగించేందుకు అనుమతి మంజూరుపై జారీ చేసిన ప్రజా ప్రకటన లింకులను మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

19 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు రెమ్‌డెసివిర్ సరఫరా చేయనున్న కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ ఏప్రిల్ 23: దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇటీవల కోవిడ్-19 కేసులు అనూహ్యంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తలెత్తిన సమస్యల పరిష్కారంతోపాటు పరిస్థితిని సమర్థంగా నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 'సంపూర్ణ ప్రభుత్వం' కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చురుకైన చర్యలపై అత్యున్నత స్థాయిలో క్రమం తప్పకుండా సమీక్ష, పర్యవేక్షణ కొనసాగుతాయి. ఆస్పత్రులలో విషమస్థితిలోగల కోవిడ్-19 రోగుల సంఖ్య పెరిగిపోవడంతో వైద్యపరంగా కేసుల సమర్థ నిర్వహణ అవసరం కావడంతో 'రెమ్‌డెసివిర్'కు డిమాండ్ పెరిగిపోయింది. ఈ మందును ప్రయోగాత్మక చికిత్సలో భాగంగా సముచిత రీతిలో మాత్రమే వాడాలని ఆరోగ్య మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకూ సూచించింది. అంతేకాకుండా ఈ మందును అక్రమంగా నిల్వచేయడం, నల్లబజారులో విక్రయించడంపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా కోరింది.

ఈ నేపథ్యంలో కోవిడ్-19 చికిత్సలో 'రెమ్‌డెసివిర్' ఇంజెక్షనుకు దేశమంతటా ఆకస్మిక డిమాండ్ పెరుగుదల దృష్ట్యా దీని దేశీయ తయారీదారుల ఉత్పత్తి సామర్థ్యం పెంచబడింది. తదనుగుణంగా తయారీదారుల కృషికి ప్రభుత్వం కూడా అన్నివిధాలా మద్దతునిస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం నెలకు 38 లక్షల ఇంజెక్షన్లు తయారవుతుండగా, ఉత్పత్తి సామర్థ్యాన్ని 74 లక్షల స్థాయికి పెంచే దిశగా 20 అదనపు తయారీ ప్రదేశాలకూ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరోవైపు దేశీయ సరఫరాను పెంచడం లక్ష్యంగా 2021 ఏప్రిల్ 11 నుంచే 'రెమ్‌డెసివిర్' ఎగుమతులను నిషేధించింది. అంతేకాకుండా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ ఇంజెక్షన్ కొరతపై వార్తలు వస్తున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరఫరా సజావుగా సాగేలా కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఔషధ విభాగంతో సమన్వయం ద్వారా దేశంలోని 19 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు 2021 ఏప్రిల్ 30వరకూ 'రెమ్‌డెసివిర్' సరఫరా అయ్యేలా మధ్యంతర కేటాయింపులు చేసింది.

తీవ్ర, విషమస్థితిలోగల, ఆక్సిజన్ మద్దతు అనివార్యమైన కోవిడ్-19 కేసుల విషయంలో మాత్రమే ప్రయోగాత్మక చికిత్స కింద 'రెమ్‌డెసివిర్' ఇంజెక్షన్ వాడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యపరమైన ఆక్సిజన్ అందజేయనున్న 14 రాష్ట్రాలకు, ఇంజెక్షన్ అధిక సరఫరా అవసరమున్న మరో 5 రాష్ట్రాలకు సంబంధించి 'రెమ్‌డెసివిర్' కేటాయింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఒకే దేశం..ఒకే హెల్త్ పాలసీ కావాలి!

హైదరాబాద్ ఏప్రిల్ 23: దేశంలో వన్ నేషన్, వన్ హెల్త్ ఫాలసీని కేంద్రం ఎందుకు తీసుకరావడం లేదని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దేశంలో కరోనా రెండోసారి విజృంభిస్తోందని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. కరోనాపై 2020 ఫిబ్రవరిలో రాహుల్ గాంధీ కేంద్రాన్ని హెచ్చరించారని గుర్తు చేశారు. అయితే, కేంద్రం చెప్పాపెట్టకుండా లాక్ డౌన్ విధించిందని విమర్శించారు. లాక్ డౌన్ సమయంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన ఉపాధి హామి ఆదుకుందని తెలిపారు. ప్రధానమంత్రి సహాయ నిధి పేరుతో 20 వేల కోట్లు వసూలు చేశారని, రాష్ట్రంలో సీఎం సహాయనిధి పేరుతో 5 వేల కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. కరోనా మందుల కోసం ఖర్చుకోసం నిధులు వెచ్చించకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ, కేసీఆర్ లకు ఎన్నికలు.. రాజకీయాల మీదనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. మూడు రకాల ధరలను నిర్ణయించడంలో మత్లబ్ ఏంటి? అని ప్రశ్నించారు. సామాన్యుడికి రూ. 600 అంటే దోచుకోవడమేనని పేర్కొన్నారు. దేశంలో కరోనా మరణ మృదంగం చేస్తోందన్నారు.

130 కోట్

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కన్నుమూత-ఈటల సంతాపం

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే కేతిరి సాయిరెడ్డి కన్నుమూశారు. నేటి తెల్లవారుఝామున 4 గంటలకు గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం హుజూరాబాద్ మండలం జూపాక. సాయిరెడ్డి గతంలో ఉమ్మడి కరీంనగర్ జడ్పీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. 1983, 1989లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.

సాయిరెడ్డి మృతి పట్ల మంత్రి ఈటల దిగ్భ్రాంతి

రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే కేతిరి సాయిరెడ్డి మృతి తీరని లోటని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా సమితి చైర్మన్ గా పనిచేసి రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని, హుజురాబాద్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి శాసన సభ లో అడుగుపెట్టి తనదైన శైలితో ప్రజలకు చేరువయ్యారని కొనియాడారు. రాజకీయాల్లో హుందాతనంతో వ్యవహరించిన సాయిరెడ్డి మరణం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో సాయిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. సాయిరెడ్డి మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సాయిరెడ్డి మృతి తో నేడు నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం చేతులెత్తేసింది: అరవింద్

నిజామాబాద్, ఏప్రిల్ 23: కేంద్ర ప్రభుత్వంపై మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్ చేసిన విమర్శల్ని ఖండించారు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి? అరవింద్. తెలంగాణలో కరోనా విజృంభిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడమే కాకుండా కేంద్రంపై నెపం నెట్టుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ వ్యాప్తిపై ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఉన్నత స్థాయి సమీక్ష కూడా నిర్వహించలేదని..ఎంత ఆక్సిజన్ అవసరం, ఎన్ని మందులు కావాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సమాచారమే లేదని ఎద్దేవా చేశారు. కేవలం విమర్శించాలన్న ఉద్దేశంతోనే మంత్రులు కేంద్రంపై నెపం నెట్టుతున్నారని.. కరోనా విషయంలో రాష్ట్రం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేవని?ఐసీయూ బెడ్స్ సరిపోవడం లేదుని?ప్రైవేటు ఆసుపత్రుల దోపిడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశారని ధర్మపురి అరవింద ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ కోసం వ్యాక్సిన్ వేసుకొమ్మని ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం కాని, ప్రచారం కాని చేయలేదని? ఇక కోవిడ్ కేసులు, మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలు ఇస్తోందన్నారు. కోవిడ్ చికిత్స కోసం ఆయిష్మాన్ భారత్ ను ఎందుకు అమలు చేయడం లేదు?.. వేరే రాష్ట్రాలు కోవిడ్ కేసులు, ఆక్సీజన్, మందులపై కేంద్రానికి వాస్తవ సమాచారం ఇవ్వడం వల్లే వాళ్లకు సరైన మద్దతు లభిస్తోందని ధర్మపురి అరవింద్ విమర్శించారు.

స్వచ్ఛ శుక్రవారం..

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి): పెద్దపల్లిరూరల్ పట్టణంలోని 8వ వార్డులో కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతరెడ్డి, కమిషనర్ తిరుపతిల సహకారంతో వార్డు పరిధిలోని కాలనీలలో పారిశుధ్య పనులు, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలంతా కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది కొండయ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

చలి వేంద్రం..

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి):ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టిఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి తోట ఆగయ్య, జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్‌రావు, ఏఎం సీ చైర్మెన్ కొండ రమేష్‌గౌడ్‌లు ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో రైతులు, హమాలీలు, ఐకెపి సభ్యుల వేసవి దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండాపురం బాల్ రెడ్డి, ఎంపిటిసి ఇళ్లందుల గీతాంజలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ను సద్వినియోగం చేసుకొవాలి. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి):45 ఏళ్లు పై బడిన వారంతా ఎలాంటి అపోహలు లోనుకాకుండా తప్పనిసరి వ్యాక్సినేషన్ వేసుకోవాలని వేములవాడ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి సూచించారు. శుక్రవారం సినారే కళా మందిర్లో వ్యాక్సినేషన్ సెంట్రల్ వ్యాక్సిన్ ను తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూకరోనా సెకండ్ వేవ్ వేగంగా వ్యాప్తి జరుగుతుందనిప్రతి ఒక్కరూ వ్యాక్సినేషన్ వేయించుకోవాలని కోరారు. అలాగే భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించాలని, చేతులను ఎల్లప్పుడూ శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రమాద పరిస్థితులు ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు .ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు

అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఆన్ లైన్.లో యోగా శిక్షణా తరగతులు!

హైదరాబాద్ ఏప్రిల్ 22: ఈ ఏడాది జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేవలం రెండు నెలలు గడువు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఆన్ లైన్ ద్వారా యోగా శిక్షణ కార్యక్రమాన్ని అందించేందుకు రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు ఉమ్మడిగా ముందుకు వచ్చాయి. యోగాపై ఆన్ లైన్ ద్వారా నిర్వహించే ఈ శిక్షణాకార్యక్రమం ఇప్పటికే ఈ నెల 21వ తేదీన ప్రారంభమైంది. ఈ కార్యక్రమంకోసం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ చేతులు కలిపాయి. ఈ శిక్షణా కార్యక్రమం తదుపరి దశగా రిపీట్ బ్యాచులు వచ్చే నెల 1వ తేదీన, ఆ తర్వాత వచ్చే నెల 21న, అనంతరం జూన్ 21న ప్రారంభమవుతాయి. యోగాసనాలను సులభంగా అభ్యసించేందుకు వీలుగా ఒక ఉమ్మడి యోగా నిబంధనావళిని ఈ శిక్షణా కార్యక్రమంలో వర్తింపజేస్తారు. గంటచొప్పున గరిష్ట వ్యవధితో కూడిన 24 తరగతుల్లో ఈ శిక్షణను నిర్వహిస్తారు. ఈ ఏడాది జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అనుగుణంగా ఈ కోర్సులను రెండు మంత్రిత్వ శాఖలు రూపొందించాయి. మన ఆలోచనా విధానం, దైనందిన ప్రజా జీవన శైలిలో యోగాకు భాగస్వామ్యం కల్పిస్తూ ఈ శిక్షణకు రూపకల్పన చేశారు.

మహమ్మారి వైరస్ తో ఒకవైపు ప్రపంచం యావత్తూ సాహసోపేతంగా పోరాటం సాగిస్తున్నప్పటికీ, మరో వైపు మళ్లీ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇది ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తూ విస్తృత స్థాయిలో ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో యోగాకు ఉన్న బహుళార్థ ప్రయోజనాలు ప్రజలకు ఉపయోగపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగాభ్యాసానికి ఉన్న ప్రత్యేకతకు ఇప్పటికే విస్తృత స్థాయిలో ప్రశంసలు కూడా లభించాయి. మారిపోయిన వాస్తవ పరిస్థితుల నేపథ్యంలో మన దైనందిన జీవితాలను సమతుల్యం చేయడంలో యోగా కీలకపాత్ర పోషించగలదన్న ఆశాభావం కూడా వ్యక్తమవుతోంది. యోగాను క్రమం తప్పకుండా పాటిస్తే ఆరోగ్యాన్ని మెరుగుపరుచకోవడానికి, శరీరంలో సహజ సిద్ధమైన రోగనిరోధక శక్తిని మరింత బలోపేతం చేసుకోవాడనికి వీలుంటుంది.

45 నిమిషాల వ్యవధితో కూడిన ఉమ్మడి యోగా నిబంధనావళిని ఈ ఏడాది నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానంగా చేపట్టనున్నారు. భారతదేశానికి చెందిన పేరెన్నిక గన్న యోగా గురువులు ఈ నిబంధనావళిని 2015లో రూపొందించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామూహిక యోగాసనాల ప్రదర్శనను చేపట్టేలా ఈ నిబంధనావళిని తయారు చేశారు. యోగా శిక్షణలో ప్రారంభకులుగా పాల్గొనే వారికి ప్రయోజనకరంగా ఉండేలా వివిధ ఆసనాల కూర్పుతో ఈ ప్రదర్శనను చేపట్టనున్నారు. సామాన్య ప్రజలు కూడా సులభంగా అభ్యసించేలా కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ప్రజల వయస్సు, లింగభేదంతో సంబంధం లేకుండా సరళమైన శిక్షణా తరగతులు, ఆన్ లైన్ యోగా తరగతుల ద్వారా వారు ఆసనాలను నేర్చుకోవడానికి వీలుంటుంది.

రెండు కేంద్ర మంత్రిత్వశాఖల తరపున మొరార్జీ దేశాయ్ యోగా అధ్యయన సంస్థ (ఎం.డి.ఎన్.ఐ.వై.) ఈ యోగా కోర్సును తీర్చిదిద్దింది. ఈ కోర్సులో పాల్గొనే వారు "యోగా వాలంటీర్" గా సర్టిఫికెట్ పొందేందుకు వీలుగా ఈ కోర్సును ఎం.డి.ఎన్.ఐ.వై. తయారు చేసింది. దేశంలో యోగా కోర్సు యోగ్యతా స్థాయిని నిర్దేశించే కేంద్ర సంస్థ అయిన యోగా సర్టిఫికేషన్ బోర్డు (వై.సి.బి.) ద్వారా ఈ సర్టిఫికెట్ మంజూరు చేయిస్తారు.

ఇన్ స్టాంట్ యోగా కోర్సుకు తదుపరి దశగా ఈ సర్టిఫికెట్ ను ప్రదానం చేస్తారు. కోర్సును ఉచితంగానే అందిస్తున్నప్పటికీ, సర్టిఫికెట్ ప్రాసెసింగ్ రుసుంగా నామమాత్రపు రుసుంగా 250 రూపాయలు చెల్లించవలసి ఉంటుంది. యోగా వాలంటరీ కోర్సు మొత్తం 36గంటల వ్యవధితో నాలుగు అంచెలు (దశలు)గా ఉంటుంది. యోగా అప్రీసియేషన్ ప్రోగ్రామ్ పేరిట తొలి అంచె శిక్షణతో ఈ కోర్సు మొదలవుతుంది. రోజూ 45 నిమిషాల చొప్పున అభ్యాసంతో 4 రోజులపాటు తొలిదశ కొనసాగుతుంది. ఆ తర్వాత రెండవ దశ మొదలవుతుంది. ఉమ్మడి యోగా నిబంధనావళి పరిచయ కార్యక్రమం పేరిట సాగే ఈ రెండవ దశ అభ్యాసం రోజూ ఒకటిన్నర గంట వ్యవధి చొప్పున 12 రోజులు సాగుతుంది. మూడవ దశలో ఉమ్మడి యోగా నిబంధనావళి సాధనా కార్యక్రమం రోజూ ఒకటిన్నర గంట వ్యవధితో ఆరు రోజులపాటు సాగుతుంది. ఇక చివరి దశ కార్యక్రమం రోజూ ఆరు గంటల వ్యవధి చొప్పున రెండు రోజులపాటు నడుస్తుంది. ఉమ్మడి నిబంధనావళి స్వయం సాధన, మధింపు, సర్టిఫికేషన్ పేరిట ఈ చివరి దశ కార్యక్రమం చేపడతారు.

రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలకు అనుబంధించిన సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రసారం చేస్తారు. ఆయా మంత్రిత్వ శాఖలకు చెందిన వివిధ విభాగాల పరిధిలోని సామాజిక మాధ్యమాల ద్వారా అంటే, యూట్యూవ్, ఫేస్ బుక్ హ్యాండిల్స్ పై కూడా ఇది ప్రసారమవుతుంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రసారం చేసే సామాజిక మాధ్య వేదికలు (ఫేస్ బుక్ తో సహా): (ప్త్రబిబిజూబ://లిలిలి.టజీఇ వఎనీనీ.ఇ నీఎ/ఎనీజీఎబీబప్త/) యూ ట్యూబ్: (ప్త్ర బి బి జూ బ : // లి లి లి . ఎ నీ బీ బి బీ ఎ వ . ఇ నీ ఎ / ఇ ప్త జీ ని ని వ శ్రీ / జఅనఖీఖీ2ణబ-ఎ3ళితీఔఇ ఇ4బనీ4ఉజూణఖి). దీనికి తోడుగా, ఫిట్ ఇండియా, ఉద్యమానికి, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖకు సంబంధించిన సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ఈ కార్యక్రమం అందుబాటులో ఉంటుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం, ఫిట్ ఇండియా ఉద్యమం ద్వారా యోగాపై సందేశాన్ని ప్రజలకు అందించేందుకు రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు భారీ ఎత్తున పరస్పర సహకారంతో పనిచేస్తాయి. ఉమ్మడిగా జరిపే ఈ కసరత్తులో భాగంగా సామాజిక మాధ్యమాన్ని ప్రధాన సాధనంగా వినియోగించుకుంటాయి. ఇంకా, రెండు మంత్రిత్వ శాఖల అజమాయిషీలో పనిచేసే విభిన్న విభాగాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, ఏజెన్సీలకు కూడా ఈ అవగాహనా కార్యక్రమంలో ప్రమేయం కల్పిస్తారు.

ఈ ఉమ్మడి అవగాహనా కార్యక్రమంతోపాటుగా, "యోగాతో కలసి సాగండి, ఇంటివద్దనే ఉండండి" అన్న సందేశాన్ని కూడా ప్రచారం చేస్తారు. వైరస్ మహమ్మారి వ్యాప్తి, ప్రజలంతా సాధ్యమైనంతవరకూ ఇంటివద్దనే గడపాలంటూ వెలువడుతున్న సూచనల నేపథ్యంలో ఈ సందేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. క్రీడారంగ ముఖ్యులు, సుప్రసిద్ధులైన క్రీడా ప్రముఖులు కూడా తమ విలువైన సందేశాలతో ఈ కార్యక్రమానికి బాసటగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోవిడ్ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జనం ఇంటివద్దనే ఉంటూ యోగాను ఎలా అభ్యసించవచ్చునో, తాము తమతమ క్రీడాంశాల్లో యోగా కారణంగా ఎంత ప్రావీణ్యం సాధించామో వారు తమ సందేశాల ద్వారా వివరించే అవకాశాలున్నాయి.

వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాకు ప్రోత్సాహం కల్పించడానికైనా సరే ఎక్కువమంది సమూహాలుగా గుమికూడకుండా జాగ్రత్త వహించాల్సి ఉంది. అందువల్ల, ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ సందేశానికి ప్రాచుర్యం కల్పించడానికి రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు డిజిటల్, వర్చువల్, ఎలక్ట్రానిక్ వేదికలను ఎంపిక చేసుకున్నాయి. తద్వారా ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనే పౌరులు కూడా తమతమ ఇళ్లవద్దనుంచే వర్చువల్ పద్ధతిలో పాల్గొనే పద్ధతిని ప్రోత్సహిస్తున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజారోగ్యంలో యోగాభ్యాస పాత్ర, ప్రజారోగ్యానికి యోగా అందించగలిగే సేవలు వంటి అంశాలపై ప్రజలకు సందేశం ఇచ్చేందుకు అన్ని భాగస్వామ్య వర్గాలు ముందుకు రావాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చాయి.

ఈ ఏడాది జూన్ 21వ తేదీన తమ ఇళ్లవద్దనే ఉమ్మడి యోగా నిబంధనావళిని పాటించడం ద్వారా ఈ సారి యోగా దినోత్సవం జరుపుకునేలా ప్రజలను ప్రోత్సహించేందుకు రెండు మంత్రిత్వ శాఖలూ ఈ పిలుపునిచ్చాయి. దీనితో ప్రజారోగ్యం, ప్రజాసంక్షేమం లక్ష్యంగా అన్ని భాగస్వామ్య వర్గాలు అందించగలిగే గణనీయమైన సేవగా ఇది నిలిచిపోతుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. యోగాభ్యాస ప్రక్రియలో ఆశించిన లక్ష్యాలను నిర్దేశించేందుకు ఈ మొత్తం ప్రక్రియ ఉపయోగపడుతుంది.

గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో బీసీలకు, మహిళలకు టిఆర్ఎస్ పెద్ద పీట- మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, ఏప్రిల్ 23: వరంగల్ మహానగర కార్పొరేషన్ ఎన్నికల్లో టిఆర్ఎస్ బీసీలకు పెద్ద పీట వేసింది. రిజర్వేషన్ల ప్రకారం వారికి కేటాయించిన సీట్లను వారికి ఇవ్వడమే గాక, అదనంగా జనరల్ స్థానాల్లోనూ బీసీలు, బీసీ, ఎస్సీ మహిళలకు 19 స్థానాలలో అవకాశం కల్పించారు. మొత్తం 66 డివిజన్లలో 11 మంది బీసీ పురుషులు, 7 గురు బీసీ మహిళలు, 1 ఎస్సీ మహిళకు జనరల్ స్థానాల్లో అవకాశం టిఆర్ఎస్ కల్పించింది.

జనరల్ పురుషుల స్థానాలుగా ఉన్న4వ డివిజన్ లో యాదవకు, 5వ డివిజన్ లో ఉప్పర, 7వ డివిజన్ లో పద్మశాలి, 31వ డివిజన్ లో మున్నూరు కాపు, 61వ డివిజన్ లో నాయీ బ్రాహ్మణ, 45వ డివిజన్ లో ముదిరాజ్, 56వ డివిజన్ లో మున్నూరు కాపు, 66వ డివిజన్ లో వారాల, 27వ డివిజన్ మున్నూరు కాపు, 35వ డివిజన్ లో మున్నూరు కాపు, 60 వ డివిజన్ లో మున్నూరు కాపులకు అవకాశం కల్పించారు.

జనరల్ మహిళల స్థానాల్లో 58 వ డివిజన్ లో మాదిగ, 63వ డివిజన్ లో ముదిరాజ్, 55వ డివిజన్ లో యాదవ, 24వ డివిజన్ లో మన్నూరు కాపు, 50వ డివిజన్ లో ఉప్పర, 59, 19వ డివిజన్ లలో మున్నూరు కాపులకు టిఆర్ ఎస్ అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ఇప్పుడున్న సో కాల్డ్ పార్టీలకు భిన్నంగా టిఆర్ఎస్ పార్టీ బడుగుల పక్షపాతిగా ఉందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల ప్రకారం దక్కాల్సినవి దక్కగా, అదనంగా 18 డివిజన్లలో బీసీలకు, 1 డివిజన్ లో ఎస్సీ మహిళకు అవకాశం కల్పించిన ఘనత టిఆర్ ఎస్ దే అన్నారు. సీఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ ల ఆదేశానుసారం పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడం జరిగిందని, వాళ్ళందరినీ గెలిపించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గ్రేటర్ వరంగల్ మహానగర ప్రజలకు పిలుపునిచ్చారు.

కరోనాతో ఇబ్బంది పడుతున్నవారు నా సేవలు ఉపయోగించుకోండి: జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 23: కరోనాతో పోరాడే వారికి కి ఎమ్మెల్యే జగ్గారెడ్డి తాను ఎప్పుడు సాయం చేయడానికి ముందు ఉంటానని చెప్పారు. అంతే కాదు కరోనా తో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు తన సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. కరోనా సోకకుండా ఉండేందుకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలు సూచనలు చేశారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు రాష్ట్ర ప్రజలు తప్పనిసరిగా రెండు మాస్క్ లు ఉపయోగించాలని.. నియోజకవర్గంలోని వ్యాపారవేత్తలు బట్టల షాప్ లో, కిరాణంలో సేటు లు తప్పనిసరిగా రెండు మస్కులు ఉపయోగించాలన్నారు..ప్రజలు కూడా షాపింగ్, దుకాణాలకు వెళ్ళిన్నపుడు రెండు రెండు మస్కులు వాడాలన్నారు..వ్యాపారవేత్తలు ఉదయం 6 గంటల ను4 మధ్యాహ్నం వరకు దుకాణాలు తెరుచుకొని ,మళ్ళీ సాయంత్రం 6 గంటలకు తెరిచి రాత్రి 8 గంటల స్వచ్ఛందంగా మూసివేయాలని సూచించారు?ఇక సంగారెడ్డి నియోజకర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఎవరు మూడు నెలలు వరకు ఎలాంటి కార్యక్రమాలు పెట్టుకోవద్దని..దయచేసి ఇంటికే పరిమితం అవ్వాలని? ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం ఇదే పాటించాలని కోరారు.

యువత బయట తిరిగి వచ్చి ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళకి కారోనా అంటించే ప్రమాదం ఉందని..యువత కు సాధారణంగా ఇమ్యూనిటి శక్తి ఎక్కువ ఉంటుంది..దీంతో కారోనా వచ్చిన తెలియదు..కానీ ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళకి అది సోకుతుంది.. కాబట్టి యువత జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఇక నియోజకవర్గంలో ఎవరైనా కరోనా తో తీవ్ర ఇబ్బంది ఎదురుకుంటున్న వాళ్ళు తన ఆఫీస్ నెంబర్ 08455-278355 కి ఫోన్ చేస్తే తగిన సహాయం చేస్తామని తెలిపారు..ఎవరైతే శ్వాస తో కానీ ఇతర లక్షణాలతో ఎక్కువ ఇబ్బంది పడుతున్నవారు తన సేవలు ఊపయోగించుకోవాలన్నారు..నాకు తెలిసిన డాక్టర్స్ ఉన్నారు సీరియస్ గా ఉన్నవాళ్ళకి నేను అటాచ్ చేస్తా డబ్బులు ఉన్నవాళ్లు కట్టుకోండి, లేనివాళ్ళకు నా శక్తీ మేరకు సహాయం చేస్తానన్నారు..అలాగే సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ కానీ ప్రైవేట్ హాస్పిటల్ లో ఎవరైనా ఆక్సిజన్ లేక ఇబ్బంది పడితే తనకు తెలియజేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి):ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్, వెంకటాపూర్, బండలింగంపల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా టిఆర్ ఎస్ పార్టీ ఇన్‌చార్జి తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపిపి పిల్లి రేణుక కిషన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటు-ందన్నారు. గిట్టుబాటు ధర వచ్చేలా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, ఏ గ్రేడ్ మాయిశ్చర్ వచ్చేలా చూసుకొని ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసిలు తిరుపతి, మల్లేశం, టీఆర్ ఎస్ నాయకులు శంకర్, కిషన్‌తో పలువురు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో బాంబుల దాడి - ఖండించిన మావోయిస్టులు

వరంగల్, ఏప్రిల్ 23: ఛత్తీస్ గఢ్ లో డ్రోన్ కెమెరాలతో పోలీసులు బాంబుల దాడికి పాల్పడటంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దక్షిణ బ్యూరో స్పందించింది. ఈ మేరకు ఒక లేఖను, డ్రోన్ ఫోటోలను విడుదల చేసింది. మావోయిస్టు నక్సల్స్ ను హతమొందించేందుకు చేస్తున్న కుట్రలలో భాగంగా టెక్నాలజిని ఉపయోగించుకొని , డ్రోన్ కెమెరాలతో నక్సల్ కదలికలను తెలుసుకొనే ప్రయత్నం చేయడం తో పాటు, నక్సల్స్ మొత్తంను మట్టుపెట్టేందుకు పోలీసులే డ్రోన్ల తో బాంబుల దాడికి తెగబడ్డారంటూ ఆరోపించింది. ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం చేసిన డ్రోన్ దాడులను బస్టర్ ఐ జి సుందర్ రాజ్ చేసిన ఆధారం లేని ఆరోపణలు ఖండించాలని లేఖలో కోరారు. డ్రోన్ల తో బాంబుల దాడికి పాల్పడ్డ ఘటనపై మధ్యవర్తులను దాడి జరిగిన ప్రాంతానికి పంపి,నిజానిజాలను నిగ్గు తేల్చి, అసలు వాస్తవ విషయాలను బయటకు తీసుక రావాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర హోంశాఖ ,మంత్రి ప్రధాన మంత్రి సలహాదారు విజయ్ కుమార్,ఆపరేషన్స్ డిజిపి అశోక్ ఆపరేషన్ల పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. డ్రోన్ల సహాయంతో దాడి జరిగిన ప్రాంతానికి విలేకరులు, ప్రజాస్వామికవాదులు వచ్చి పరిశీలించి,వాస్తవ విషయాల్ని బాహ్య ప్రపంచానికి తెలుయజేయాలని కోరారు.కాగా, ఏప్రిల్ 19న మావోయిస్టు పి ఎల్ జి ఎ పడగొట్టిన 2 డ్రోన్లను చిత్రాలను మీడియాకు విడుదల చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నడుచుకొనే చర్యలను మావోయిస్టు దక్షిణ సబ్ జోనల్ బ్యూరో తీవ్రంగా ఖండించింది.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23: గద్వాల మండల లోని లత్తిపురం, బీరెల్లి, గ్రామంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఐ కే పి సెంటర్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రైతు బీమా, రైతు బంధు, సబ్సిడీ ద్వారా ఫర్టిలైజర్ రైతులకు వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారన్నారు..రైతులకు మద్దతు ధర 1888 రూపాయలు ఇచ్చారన్నారు. గత సంవత్సరం కరోనా సమయంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి వారి ఖాతాలో డబ్బులు జమ చేశామన్నారు.తమ తమ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని..రైతులు పొలంలో పని చేసేటప్పుడు కూడా సామాజిక దూరం పాటించాలన్నారు. రైతులు మాస్కు ధరించాలి.. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కరోనా టీకా వేయించుకోవాలి.. ఎలాంటి అపోహలు భయం వద్దు అని తెలిపారు.కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు.. సలహాలు తప్పనిసరిగా పాటించాలి ..కరోనాని అరికడదాం..మన ప్రాణ

కరోనా కల్లోలం: పేద ప్రజలకు కేంద్రం తీపి కబురు..

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22: : కరోనా మహమ్మారి దేశమంతటా అల్లకల్లోలం సృష్టిస్తున్నది. రోజూవారీ కొత్త కేసుల సంఖ్య ఏకంగా మూడు లక్షల మార్కును కూడా దాటింది. గత రెండు రోజుల నుంచి వరుసగా మూడు లక్షలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని పేద ప్రజలకు తీపి కబురు చెప్పింది.

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద మే, జూన్ నెలల్లో ఉచితంగా ఆహార ధాన్యాలను సమకూర్చనున్నట్లు కేంద్ర సర్కారు తెలిపింది. ఒక్కో లబ్ధిదారుకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను అందించనున్నట్లు వెల్లడించింది. ఈ పథకం ద్వారా మొత్తం 80 కోట్ల మందికి లబ్ధి చేకూరనుందని, దీని కోసం తాము రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని కేంద్రం ప్రకటించింది.

విరార్ ఆసుపత్రి లో మంటలు రేగి ప్రాణనష్టం జరగడం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ ఏప్రిల్ 23: విరార్ లోని కోవిడ్-19 ఆసుపత్రి లో మంటలు చెలరేగిన కారణం గా ప్రాణనష్టం జరగడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మహారాష్ట్ర లోని విరార్ లో ఆసుపత్రి లో మంట లు రేగిన ఘటన లో ప్రాణాలను కోల్పోయిన వారి దగ్గరి సంబంధికులకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి రెండు లక్షల రూపాయల చొప్పున సహాయక రాశి ని మంజూరు చేసేందుకు ప్రధాన మంత్రి ఆమోదం తెలిపారు. తీవ్రం గా గాయపడ్డ వారికి 50,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుంది.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవు : డీఐజీ రంగనాథ్

నల్లగొండ, ఏప్రిల్ 22:: కరోనా మహమ్మారి నేపథ్యంలో అవసరాన్ని, ఆపదను ఆసరాగా చేసుకుని ఆస్పత్రులు అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఐజీ రంగనాథ్ హెచ్చరించారు. కొవిడ్ విజృంభన నేపథ్యంలో రోగుల సహాయక చర్యలపై చర్యలపై డీఐజీ స్పందిస్తూ.. కరోనా మందులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కరోనా టెస్టింగ్ కిట్స్, రెమిడిసివర్ అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్ల విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా చికిత్సలు, అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఐజీ హెచ్చరించారు.

కరోనాపై టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి వినూత్న ప్రచారం

సిద్దిపేట,ఏప్రిల్ 23:: కరోనా మహమ్మారిపై టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి వినూత్నంగా ప్రచారం నిర్వహించారు.

సిద్దిపేటలో పర్యటిం చిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి.. గుర్రం పై ఎక్కి విస్తృతంగా అవగాహన కల్పిం చారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావు మాస్కులు ధరించిన ఫోటోలను ప్రదర్శిస్తూ.. మాస్కు ధరించండి.. కరోనాను అరికట్టండి.. వంటి నినాదాలను ఆ ఫోటోలపై రాసి ఉంచారు.

అలా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ గుర్రాలపై తిరుగుతూ సిద్దిపేట ప్రజలకు అవగాహన కల్పించారు. కరోనాను అరికట్టే ఆయుధం మాస్కే అని అటు వైద్యులు, ఇటు ప్రభుత్వాలు చెబుతున్న విషయం తెలిసిందే.

టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

సిద్దిపేట,ఏప్రిల్ 23:: బీజేపీకి ఎదురుదెబ్బ. సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల ముంగిట బీజేపీకి చెందిన ఇద్దరు ముఖ్య నాయకులు అధికార టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు శివరాత్రి నాగేష్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు అలకుంట ఆనంద్ తమ అనుచరులు 200 మందితో కలిసి టీఆర్ఎస్‌లో చేరారు.గత కొన్నేళ్లుగా పట్టణం సాధించిన అభివృద్ధి పట్ల ముగ్ధులైన ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరినట్లు హరీష్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాల్సిందిగా వారికి పిలుపునిచ్చారు. దండు సంపత్, అలకుంట చిన్న, బోదాస్ కుమార్, వల్లపు మలేష్, కుమార్, వెంకట్, చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇది పద్ధతి కాదు.. ఢిల్లీ సీఎంపై ప్రధాని మోదీ ఆగ్రహం.. వీడియో

న్యూఢిల్లీఏప్రిల్ 23:: దేశంలో కరోనా కేసులు తీవ్రంగా ఉన్న పది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైన విషయం తెలుసు కదా. ఈ సందర్భంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎంతో సీఎంల సమావేశం సందర్భంగా దానిని కేజ్రీవాల్ లైవ్ టెలికాస్ట్ చేయడమే దీనికి కారణం.

కరోనాను ఎదుర్కోవడానికి ఓ నేషనల్ ప్లాన్ ఉండాల్సిన అవసరం ఉన్నదంటూ మాట్లాడుతున్న కేజ్రీవాల్‌ను మధ్యలో ఆపిన మోదీ.. ఇది పద్ధతి కాదు. పీఎంతో జరుగుతున్న ఇన్‌హౌస్ మీటింగ్‌ను లైవ్ టెలికాస్ట్ చేయడం ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడమే అవుతుందని మోదీ అన్నారు. అయినా కూడా కేజ్రీవాల్ మాత్రం మోదీ చెప్పిన విషయాన్ని పట్టించుకోకుండా తాను చెప్పాల్సింది చెబుతూ వెళ్లారు. ఏదైనా తప్పు మాట్లాడితే క్షమించాలని అన్నారు.

చిరస్మరణీయమైన జ్ఞాపకాలు మిగిలిఉండేలా

పోలీసులు సమర్ధవంతంగా విధులను నిర్వహించాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్. ఏప్రిల్ 23:(నేటినిజం ప్రతినిధి):చిరస్మరణీయమైన జ్ఞాపకాలు మిగిలిఉండేలా పోలీసులు సమర్ధవంతమైన సేవలతో విధినిర్వాహణ కొనసాగించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఎలాంటి నేరమైనా సదరు కేసుల్లో నిందితులు శిక్షింపబడేలా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పారు.

శుక్రవారంనాడు కమిషనరేట్ కేంద్రంలో సమన్లు,వారెంట్ల అమలు బృందాలతో పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న నేరాలతోపాటు సంచలనాత్మక కేసుల్లో పరారీలో ఉన్న నిందితులపై జారీఅయిన వారెంట్లను అమలుచేసి అరెస్ట్‌ల అనంతరం న్యాయస్థానాల్లో హాజరుపరిచినట్లయితే గతకొన్ని సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్నకేసులు పరిష్కారం అవుతాయన్నారు. కొత్తకోణాల్లో ఆలోచిస్తూ దీర్ఘకాలంనుండి పెండింగ్‌లో ఉన్న వారెంట్లను అమలు చేయాలని చెప్పారు. పెండింగ్ వారెంట్ల అమలుకోసం కమిషనరేట్ పోలీసులు అమలు చేస్తున్న ఆపరేషన్ తలాష్ సత్ఫలితాలను సాధిస్తూ ముందుకుసాగుతోందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా ఏమాత్రం అవకాశాలులేని కేసుల్లో నిందితులు పట్టుబడుతున్నారని చెప్పారు.

మరికొందరు పోలీసులు వారెంట్ల అమలును సీరియస్ తీసుకున్నారనే విషయాన్ని తెలుసుకుని న్యాయస్థానాల్లో లొంగిపోతున్నారని ఇదికూడా వారెంట్ల అమలుబృందాలు చేస్తున్న అంకితభావంతో చేస్తున్న కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ తలాష్ కార్యక్రమంలో ఇప్పటి వరకు 92పెండింగ్ వారెంట్లు అమలయ్యాయని వివరించారు. వివిధ నేరాల్లో నిందితులుగా తప్పించుకుని తిరుగుతున్న వారిని పట్టుకునేందుకు వారెంట్ల అమలు బృందాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు సైతం వెళ్ళి సదరు నిందితులను అరెస్టులు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. మగపోలీసులతో సమానంగా పోటీపడుతూ మహిళపోలీసులు సైతం కుటుంబాలకు రోజుల తరబడి దూరంగా ఉంటూ ప్రణాళికాబద్ధంగా వారెంట్లను అమలు చేయడం ఆహ్వానించదగిన పరిణామమని తెలిపారు. ఈ స్ఫూర్తి అన్నిస్థాయిలకు చెందిన పోలీసుల్లో రావాలన్నారు. విధినిర్వాహణలో ప్రతిభ కనబరిచిన వారికి ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

వారెంట్ల అమలులో ధైర్యసాహసాలు ప్రదర్శించడంతోపాటు, చాకచక్యంగా వ్యవహరిస్తూ ముందుకుసాగి ఫలితాలను రాబడుతున్న వారెంట్ల అమలు బృందాలకు చెందిన పోలీసులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అందించే వివిధ రకాల పతకాలకు వారిపేర్లను ప్రతిపాదిస్తామని హామీఇచ్చారు. ఈనెల 30వరకు ఆపరేషన్ తలాష్ మొదటి విడత పూర్తవుతుందని, మే 01నుండి కమిషనరేట్ వ్యాప్తంగా చురుకుగా పనిచేసిన వారితో మరో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అమలు చేస్తామని, ఈ బృందాలకు ఏఎస్ఐ సుజాత ఇంఛార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు.

సమన్లు,వారెంట్ల బృందం విభాగానికి ఏఎస్ఐ సుజాత ఇంఛార్జిగా నియామకం

మే 01నుండి కమిషనరేట్‌లోని సమన్లు,వారెంట్ల విభాగానికి ఏఎస్ఐ సుజాత ఇంఛార్జిగా నియమిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ప్రకటించారు. ఈ బృందానికి ఒకవాహనంతోపాటు అదనపు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని తెలిపారు. ఏఎస్ఐ సుజాత ఇంఛార్జి పర్యవేక్షణలో ఈ బృందాలు ప్రతికేసు ఫైళ్ళను పరిశీలిస్తూ వారెంట్ల అమలును కొనసాగించనున్నాయని చెప్పారు.

ఈ సమావేశంలో ఏఎస్‌పిలు రితిరాజ్, ఆర్ ప్రకాష్, టి మహేష్‌గౌడ్, ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్, రాజేష్‌లతోపాటుగా పలువురు పోలీసులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రోత్సాహకాలు

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి):గత నెలలో ఫంక్షనల్ వర్టికల్ వారీగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్‌అధికారులకు సిబ్బందికి అప్రిసియేషన్ సర్టిఫికెట్ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ అందజేస్తారు .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత నెలలో వర్టికల్ వారిగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను గుర్తించి అప్రిసియేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వహించి రివార్డులు, అవార్డులు పొందాలని సూచించారు. కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్ట్మెంట్లో కచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. రిసెప్షన్, బ్లూ కోల్ట్స్, సెక్షన్ ఇన్చార్జ్, స్టేషన్ రైటర్, టెక్ టీం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ, మరియు సమన్స్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారులకు సిబ్బందికి (10) మందికి అప్రిసియేషన్ సర్టిఫికెట్లనుప్రయాణం చేసినట్టు ఆయన తెలిపారు.

ఫంక్షనల్ వర్టికల్ వారిగా అప్రిసియేషన్ అందుకున్న వారి వివరాలు.లక్ష్మారెడ్డి ఎస్.ఐ ఆఫ్ పోలీస్.(తంగాలపల్లి),.అభిలాష్ ఎస్.ఐ ఆఫ్ పోలీస్.బోయినపల్లి. గీతాంజలి (రిసెప్షనిస్టు) వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ ,. రాజేంద్రప్రసాద్ (రైటర్)చందుర్తి పోలీస్ స్టేషన్,దాస్ (బ్లూ కోల్ట్స్) సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్,శివ ప్రసాద్ (కోర్ట్ డ్యూటీ ఆఫీసర్) ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్.సురేష్ (వారెంట్ అండ్ సమన్స్) ఇల్లంతకుంటా పోలీస్ స్టేషన్, అనూష(టెక్నీషియన్)సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్,. సతీష్ (క్రైమ్ స్టాఫ్) ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్..ఏ. ఎస్.ఐ రామస్వామి(జనరల్ డ్యూటీ ఆఫీసర్) వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్.వీరిని జిల్లా పోలీస్ కార్యాలయంలో లో ప్రత్యేకంగా అభినందించారు.

జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలి..

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి): కరోనా నేపద్యంలో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జోగాపుర్ ఎంపిటిసి మ్యాకల గణేష్ అన్నారు,శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహమ్మారి కరోనా నేపథ్యంలో చాలా మంది జర్నలిస్టులు విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారని,ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలన్నారు, జర్నలిస్టుల విధి నిర్వహణలో భాగంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు,మృతుల కుటుంబాలకు ప్యాకేజీ అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,

ఆపత్కాలంలో ప్రయివేటు టీచర్లకు సర్కారు అండ హర్షణీయం

-47వ డివిజన్ లో సన్న బియ్యం పంపిణీ చేసిన కార్పొరేటర్ శర్ఫుద్దీన్

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 23: (నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర ప్రభుత్వం కరోణ వ్యాధి విజృంభిస్తున్న తరుణంలో ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం గా రెండు వేల రూపాయలు, 25 కేజీల సన్నబియ్యం ప్రకటించడం హర్షణీయమని 47వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ శర్ఫుద్దీన్ అన్నారు.

శుక్రవారం 47వ డివిజన్ పరిధిలోని 110 నెంబర్ గల రేషన్ షాపులో ప్రయివేటు టీచర్లకు కార్పొరేటర్ శర్ఫుద్దీన్ ఒక్కొక్కరికి 25కిలోల సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ పంపిణీ పాఠశాలలు పున ప్రారంభం అయ్యే వరకు కొనసాగుతోందన్నారు. క్యూ పద్ధతిలో నిలబడి, బౌతికదురాన్ని పాటిస్తూ, మాస్కులు విధిగా ధరించి బియ్యం తీసుకోవాలని ప్రయివేటు టీచర్లను కోరారు. ఈకార్యక్రమంలో డీలర్ ధర్మరాజు, ప్రయివేటు టీచర్లు పాల్గొన్నారు.

భారతదేశంలో పేరోల్ రిపోర్టింగ్ - ఒక అధికారిక ఉపాధి దృక్పథం

హైదరాబాద్ ఏప్రిల్ 23: గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ పరిధిలోని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) దేశ ఉపాధి అవుట్‌లుక్ పై పత్రికా నోట్ విడుదల చేసింది.

కొన్ని కోణాలలో పురోగతిని అంచనా వేయడానికి సెప్టెంబర్, 2017 నుండి ఫిబ్రవరి, 2021 వరకు ఎంచుకున్న ప్రభుత్వ సంస్థలతో అందుబాటులో ఉన్న పరిపాలనా రికార్డులను ఆధారంగా చేసుకొని దేశంలోని ఉపాధి దృక్పథం గురించిన వివరాలను ఇందులో వెల్లడించింది.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.195 OF 2020

Between:
Mrs. A. Kaveri and others .....Petitioners
And
Mr.P. Balakrishna and others ..Respondents

To
Mr. P. Balakrishna
S/o. P. Venkatesh,
Age: 24 years, Occ:Driver of Tipper bearing No.TS 08UC 0056, H.No. 2-312, Pentla velly Village & Mandal Nagarkurnool, Telangana.
...Respondents No. 1

Whereas the above named Petitioners filed compensation petition against you and The United India Insurance Co.Ltd. for a sum of Rs.15,00,000/- for the accident caused by your vehicle Tipper bearing No. TS 08UC 0056 on 13-12-2019 Hayathnagar ps Limits. The above case is posted to **16-06-2021.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE HON'BLE COURT)

C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18, Swaroop Nagar Uppal, Hyderabad
Ph: 9440431541

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.